# సింగిల్ పేజీ కథలు

## చెప్పుకోలేని బాధ

**'సారీ..నాకిష్టంలేదు' సినిమా ఆరోజే రిలీజ్ అవుతోంది. థియేటర్ ముందు కాలే జీలకు ఎగనామం పెట్టి వచ్చిన కుర్రకారే కనిపిస్తోంది. హీరో హీరోయిన్ కొత్తవా లైనా బడాస్టార్లకు వచ్చే జనం వచ్చారు. అలా రావడానికి కారణం లేకపోలేదు. ప్రతి పోస్టర్లల్లో హీరోయినే వుంది. ఆమె ఇచ్చిన ప్రతి భంగిమ ఎంతో ప్రావోకే టింగా వుంది.**

సినిమా మొదలవ్వటానికి ఇంకా గంట టైం వుంది. ప్రేక్షక దేవుళ్ళను దర్శనానికి లోనికి పంపకుండా బయటే నిలబెట్టారు.

ఇంతలో ఆ థియేటర్ దగ్గరకు ఆనంద్ వచ్చి ఓ చోట నిలబడ్డాడు- అక్కడ వున్నవాళ్లంతా తన వయసువాళ్ళే. వాళ్లల్లో కొంతమంది కుర్రాళ్ళు హీరోయిన్ గురించి చర్చించుకుంటున్నారు.

"ఈ హీరోయిన్ బాంబేదేనా?"

"కాదురా-తెలుగమ్మాయేనట"

"మరి పేరేంటి రతికా అని వుంది"

"అందరిలాగే ఈ అమ్మాయి కూడా పేరు మార్చుకుందేమో"

వాళ్ల డిస్కషన్ ఇంతటితో ఆగలేదు.

ఆమె అంగాంగాల గురించి, ఎఫైర్ల గురించి పచ్చిగా మాట్లాడేసుకుంటు న్నారు.

ఆనంద్‌కు అక్కడ వుండబుద్ధి కాలేదు. వెళ్ళిపోదామను కుంటుండగా, థియేటర్ గేటు తెరిచారు. ఆలస్యమైతే ఏ సీన్ మిస్ అయిపోతామేమోనన్నట్లు బిల బిలమంటూ లోనికి వెళ్తున్నారు.


రెండు నిముషాల్లో థియేటర్ బయట ఖాళీ అయిపో యింది. ఆనంద్ టిక్కెట్ చేతిలో పట్టుకుని లోపలికెళ్దామా లేదా టిక్కెట్ చించేసి వెళ్ళిపోదామా అని ఆలోచిస్తూ అక్కడే నిలబడ్డాడు. ఇంతలో సినిమా స్టార్ట్ అవుతోంది అన్నట్లు బెల్ మోగింది.

ఏదో నిర్ణయానికి వచ్చిన వాడిలా థియేటర్లోకి వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు.

టైటిల్స్ అయిపోగానే, మొదటిసీన్‌లోనే హీరోయిన్ రతిక స్నానం చేస్తున్న దృశ్యం. అందరూ ఆబగా చూస్తు న్నారు ఒక్క ఆనంద్ తప్ప!

కాసేపు అయ్యాక ఇంకో సీన్లో రతికను హీరో తమకంగా కౌగలించుకుంటున్నాడు. ఇంతలో సెన్సార్ వాళ్ల పుణ్యమాని ఆ సీన్ అంతటితో కట్ అయిపోయింది. తమకేదో అన్యాయం జరిగినట్లు థియేటర్లో ప్రేక్షకులు కేకలు ఈలలు వేశారు.

మళ్ళీ కాసేపు అయ్యాక ఇంకో రసవత్తరమైన సీన్ వచ్చింది. ఆ సీన్లో రతిక బట్టలుతుకుతుంటే పక్కింటాయన చాటుగా చూస్తుంటాడు- ఆయనలాగే ప్రేక్షకులు కూడా కన్నార్పకుండా చూస్తున్నారు. మళ్ళీ ఇంకో సినిమా తనకు



ఉంటుందో వుండదో అన్నట్లు ఈ సిన్మాలోనే తన అందాలన్నీ ప్రదర్శించింది రతిక. ఆనంద్ థియేటర్లో కూర్చోలేక లేచి బయటకు వచ్చేశాడు. తను అలా బయటకు వచ్చేస్తుంటే ఎవడో ఆనంద్ మగతనం మీద కామెంట్ చేశాడు.

అదేం పట్టించుకోకుండా వచ్చి ఓ టీ హోటల్లో కూర్చొని బాధతో వచ్చిన ఏడుపును కంట్రోల్ చేసుకున్నాడు. ఆనంద్ బాధ అక్కడున్న వాళ్ల ఎవరికీ అర్థం కాదు. ఎందుకంటే హీరో యిన్ రతిక ఆనంద్ స్వంత చెల్లెలు కాబట్టి.

**-చిర్రావు ప్రశాంతి (హైదరాబాద్)**

★★★

## పలకరింపు

నాకు అది ఓ అలవాటుగా మారింది.

సాయంత్రం ఆఫీసు నుంచి నేరుగా ఆ బస్టాప్‌కి వస్తాను. అదే సమయంలో ఆమె కూడా అక్కడికి చేరు కుంటుంది.

ఒకరోజు యధాలాపంగా ఆమెను చూశాను.

ఎందుకో తెలీదు. ఆమె... ఆమె ప్రవర్తన నన్ను ఆక ర్షించింది.

ఒంటరిగా ఆమె బస్టాపునకు వస్తుంది. ఆమెను చూడగానే డ్రైవరు, కండక్టరు కూడా పలకరింపుగా నవ్వు తారు. సాదరంగా ఆమెను లోపలికి ఆహ్వానిస్తారు.

మొదటి వరుసలో కిటికీ పక్కన ఆమె కూర్చుం టుంది. ప్రతి రోజూ అదే స్థలంలో ఆమెకు సీటు ఎలా దొరుకుతుందో నాకు అర్థమయ్యేది కాదు.

బహుశా కండక్టరే ఆమెకు సీటు రిజర్వు చేస్తాడేమో! ఇదేమంత పెద్ద విశేషం కాకపోయినా...

ఆ తర్వాత ఆమె..ఫోన్ బుక్ తీస్తుంది. అందులో నెంబర్లు చూసుకుంటూ వరు సగా ఫోన్ చేస్తుంది. దాదాపు అర్థగంట పైగా ఇది సాగుతుంది.

చేతిలో మొబైల్ ఉండగా..ఫోన్ బుక్ చూడటం దేనికో?

చుట్టుపక్కల వారిని పట్టించుకో కుండా-

ఆమె నవ్వులు..ఫోన్ మాట్లాడుతూ మధ్యలో కేరింతలు కొట్టటం...ఎందుకో తెలీదు..నాలో అనుమానం రేపాయి.

ఒకసారయితే ఫరవాలేదు. ప్రతి రోజూ ఇదే తంతు.

భుజాన బ్యాగు తగిలించుకుని, బస్టా పులోకి రావటం, ఇలా నవ్వులు విన రటం.

బహుశా మగరాయుళ్లను ఉచ్చులోకి లాగుతోం దేమో!

మంచి వయస్సులో ఉన్న అమ్మాయి పలకరింపు లతో కవ్విస్తే..సిటీలో ఇలాంటి 'మాయలేడీ'లు ఎక్కువ య్యారు. మగవాళ్లు ఏమవుతారో!

సాటి మగవాళ్లపట్ల నాలో తెలియని సానుభూతి.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్!" అడిగాడు అతను.

నేను సమాధానం చెప్పేలోపే మళ్లీ అడిగాడు.

"ఆమె గురించా?" కాదనలేకపోయాను.

ప్రతిరోజూ ఆమెను నేను గమనించటం...అతను గుర్తించాడు. కొలీగ్ కావటంతో అప్పుడప్పుడూ ఆట పట్టి స్తుంటాడు. "కొంప తీసి ప్రేమలో పడ్డావా?"

ఈసారి మాట్లాడక తప్పింది కాదు.

"అదేం లేదు. రోజూ చూస్తున్న వ్యక్తి కదా? ఈరోజు

రాకపోవటంతో.."

"నువ్వన్నది నిజమే. నెల నుంచి చూస్తున్నాం ప్రతి రోజూ" చెప్పాడు నా భావాలు అర్థమయినట్టు.

అక్కడితో ఆగితే బావుండేది. "ఈరోజెవరో ఆ వగలాడి వలలో పడుంటారు. రోజా మాటలతో కవ్విస్తుంది కదా!" అంటూండగానే...అతని చెంప పగిలింది.

ఇద్దరం షాక్‌కు గురయ్యాం..ఈ ఆకస్మిక పరిణామానికి ఎదురుగా కండక్టర్. కోపంతో అతని ముక్కుపుటాలు ఎగిసిపడుతున్నాయ్!

"మీకేం తెలుసని- నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. ఆమె ఎవరో..ఏం చేస్తుంటుందో మీకు తెలుసా?" నోరుజారి ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నాం. మాట్లాడలేకపోయాం. అతనే చెప్పటం కొనసాగించాడు.

"మృత్యుముఖంలో ఉన్న ఎందరికో చివరి కోరిక తీరుస్తున్న దేవత ఆమె.."

"అంటే అర్థం కాలేదు కదూ! కేన్సర్‌లాంటి ప్రాణాంతక వ్యాధులు సోకి రేపోమాపో చనిపోతున్నారన్న వాళ్లను ఆమె కలుస్తుంది. రోజా పలకరిస్తుంది. ఫలానా నటుడిని కలవాలనో, ఫలానా పని చేయాలనో ఆశపడేవారిని.. ఊరడించి ఆ కోరిక తీరుస్తుంది. అందుకు ఎంత ఖర్చయినా భరిస్తుంది"

నిజమే! ఇలాంటి సంస్థ ఒకటుందని ఇంతకుముందు పత్రికల్లో చదివాను. ఆమె ఆ సంస్థలో పనిచేస్తుందంటే నాకు ఆశ్చర్యం కలిగింది.

"మొన్నామధ్య విద్యుత్ షాక్ తగిలి..రెండు చేతులు..ఒక కాలు చచ్చుబడిపోయిన చిన్నారి..క్రికెట్ ఆడాలనుంది అని కోరితే... కృత్రిమ పరికరాలు అమర్చి, ఆ ఆశ తీర్చిన ఆవిడ..నిజంగా ఎంత గొప్ప వ్యక్తి.."

కండక్టర్ ఆరాధనా పూర్వకంగా ఆమె గురించి చెబుతుంటే మాకు మాట రాలేదు.

"ఓ రోడ్డు ప్రమాదంలో భర్తను, పిల్లల్ని కోల్పోయి, ఒంటరితనంతో నలిగిపోతున్నది. ఆమె గురించి తేలిగ్గా మాట్లాడితే..."

మేమెంత తప్పు చేశామో అర్థం అయింది. మనుషుల బాహ్యప్రవర్తన చూసి అభిప్రాయం ఏర్పరచుకోవటం ఎంత పొరపాటో గ్రహించాము.

ముఖ్యంగా నేను సిగ్గుతో చితికిపోయాను. కండక్టరు చెబుతూనే ఉన్నాడు. అవేమీ నా చెవిన పడలేదు.

"మళ్లీ ఆమె నా కంట ఎప్పుడు పడుతుందో..క్షమించమని వేడుకోవాలి.." దృఢంగా అనుకున్నాను.

ఆమె గురించి ఆలోచిస్తూండిపోయాను.


**-శ్రీసాయివల్లవి** (సికిందరాబాద్)

***

# పరీక్ష

ఎమ్.సి.ఏ పూర్తిచేసిన వెంటనే నెలకి ఇరవై వేల జీతంతో సొంత ఊర్లోనే మా అబ్బాయికి ఉద్యోగం రావడం చాలా అదృష్టంగా అందరూ కొనియాడారు. అలాంటిది, మరో మూడు నెలల్లో ఒక పెద్ద అమెరికన్ కంపెనీ నుండి ఉద్యోగానికి కాల్ లెటర్ రావడంతో మమ్మల్ని తెలిసిన వాళ్ళందరూ పొగడ్తల్తో ముంచెత్తారు.

మేం కూడా అబ్బాయి భవిష్యత్తు ఇంత ఉజ్వలంగా ఉంటుందని ఊహించలేదు. దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టినా, చదువులో ప్రతిభ కనబరుస్తూ, టెన్తు హయ్యర్ ఫస్ట్ క్లాసులో పాస్ కావడంతే, కాలేజీలో స్కాలర్‌షిప్ లభించింది. ఎమ్.సి.ఏ. పాసుకావడం, వెనువెంటనే ఇక్కడే మంచి కంపెనీలో ఉద్యోగం లభించడం అంతా వెనువెంటనే జరిగిపోయాయి. కలిగినంతలో అల్లారుముద్దుగా పెంచిన మాకు, కొడుకు అభివృద్ధి



ఆనందదాయకమే అయింది.

అమెరికన్ కంపెనీ రిటెన్ టెస్టుని, ఇంటర్వ్యూని హైదరాబాద్‌లోని ఒక పేరుమోసిన ఫైవ్‌స్టార్ హోటల్లో అరేంజ్ చేసారు. అబ్బాయితోపాటు నేనూ, హైదరాబాద్ వెళ్దామని బయలుదేరాను. త్వరలోనే అమెరికా వెళ్ళిపోతున్న కొడుకుని విడిచి రెండురోజులు కూడా ఉండలేనని మా ఆవిడ కూడా బయలుదేరింది. పరీక్షలో పాసవుతాడా లేదా అన్న టెన్షన్ మాకు లేదు.

మా అబ్బాయి ప్రతిభపై మాకు పూర్తి నమ్మకం ఉంది. అయినా, అబ్బాయి ఏదైనా టెన్షన్‌కి గురవుతున్నాడేమోనని చూశా. నిశ్చింతగా బస్సు కిటికీలోంచి బైటకు చూస్తూ కూర్చున్న అబ్బాయిని మాట్లాడి డిస్టర్బ్ చేయాలనిపించలేదు.

హైదరాబాద్‌లో బస్సు దిగి, రాత్రి హోటల్లో రెస్టు తీసుకొని, మర్నాడు ఉదయాన్నే రిటెన్ టెస్టు సెంటర్‌కు చేరుకున్నాం. చాలామంది అభ్యర్థులు అప్పటికే చేరుకొని ఉన్నారు.

మా అబ్బాయి రిటెన్ టెస్టు రాస్తున్నంత సేపూ, బైట హాల్లోని సోఫాలో మేం వెయిట్ చేసాం. గంటన్నరలో రిటెన్ టెస్టు ముగించుకొని, మా అబ్బాయి మా వద్దకు చేరాడు. రిటెన్ టెస్టు రిజల్టు ప్రకటించడానికి ఇంకా రెండు గంటలు పడుతుంది. ఇందులో పాస్ అయిన వాళ్ళని వెనువెంటనే ఇంటర్వ్యూ చేసి, కంపెనీలో ఉద్యోగానికి సెలక్ట్ చేస్తారు.

మిగిలిన అభ్యర్థులంతా ఒకచోట గుమిగూడి, సమాధానాలు సరిగా రాసారో లేదో చూసుకుంటుండడం చూసి, మా అబ్బాయిని కూడా వాళ్ళ దగ్గరకు పంపించాను. వెళ్ళినవాడు అందరి సమాధానాలను చూస్తూ, వాళ్ళకి తెలియని ప్రశ్నలకు సమాధానాలు చెప్తూ, అందర్లో కలిసిపోయాడు. అందరూ తెలియక వదిలేసిన ప్రశ్నలకు కూడా సమాధానాలు చెబుతున్న వాడి తెలివితేటలకు మురిసిపోతూ చూస్తూండిపోయాం.

ముందుగా ప్రకటించినట్లే, రెండు గంటల్లో ఆన్సర్ షీట్సు వెరిఫై చేసి, రిజల్ట్స్ ప్రకటించారు. అయితే, మేమూహించని విధంగా మావాడు పరీక్షలో ఫైయిలై పోయాడు. నమ్మశక్యం కాక, రిజల్ట్ ఛార్ట్ పదే పదే చూశాను. ఈ పరిణామం ఊహించనిదేమో, నేను నిజంగానే షాక్ అయ్యాను.

మా అబ్బాయిని ఓదారుద్దామని వెంటనే బయటకు వచ్చాను. కానీ వాడు మామూలుగానే ఉండడంతో, తేలిగ్గా నిట్టూరుస్తూ, మా ఊరికి బయలుదేరదీశాను.

తిరుగుప్రయాణంలో, బస్సులో, కిటికీ అద్దంలోంచి బయటకు చూస్తూ ఉండిపోయిన అబ్బాయిని దగ్గరకు తీసుకొని ఓదారుస్తూ "నిరాశ చెందనవసరం లేదు నాన్నా, మరో కంపెనీలో ట్రై చేద్దాంలే" అన్నాను.

వాడు తలెత్తి నా వైపు చూస్తూ, "నేను తెలిసిన ప్రశ్నలకు కూడా జవాబులు తప్పులు రాసి ఫైలయ్యాను డాడీ. నిన్న రాత్రంతా ఆలోచించిన తరువాత మీరు నన్నెంతగా ప్రేమిస్తున్నారో అర్థం చేసుకున్నాను. చివరికాలంలో ఆసరాగా ఉంటాడనే ఆశతో, అల్లారుముద్దుగా పెంచిన ఒక్కగానొక్క కొడుకూ, అమెరికా వెళ్ళిపోయి, శాశ్వతంగా దూరమైపోతాడని తెలిసినా, ఆ బాధనంతా దిగమింగి, నా భవిష్యత్తు కోసమే తాపత్రయం పడుతున్న మీలాంటి ప్రేమమూర్తుల్ని వదలి, డబ్బు కోసం అక్కడికి వెళ్ళకూడదని నిర్ణయం తీసుకున్నా.

ఇప్పుడు నాకొస్తున్న ఇరవై వేలలో పదివేలకు పైగానే మిగులుతోంది. నా భవిష్యత్తుకోసం, ఆ సేవింగ్స్ చాలు. జీవితం కోసం సంపాదన గానీ, సంపాదన కోసం జీవితం కాకూడదు డాడీ. 'మనందరి ఆనందకరమైన జీవితం' అనే పరీక్షలో పాసవడం కోసం ఈ పరీక్షలో కావాలనే ఫైయిలయ్యాను" అన్నాడు.

మా మనసుల లోపలి పొరల్లోకి తొంగిచూస్తూ, మా ఆవేదనని అర్థం చేసుకొని, చిన్న వయస్సులోనే వాడు తీసుకున్న మంచి నిర్ణయానికి , ఆనందంతో చూస్తుండిపోయాను.

**-బి.హెచ్.వి.నాగేశ్వరరావు** (రాయగడ)